స్థైన నియంతృత్వం మనకి తప్పాలంటే ఈ ఆశయం కార్యరూపం ధరించటంకంటే వేరే మార్గం లేదు.

ప్రపంచలోని ముఖ్యమైన ప్రజాస్వామ్యపు దేశాలన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థపై ఆధారపడ్డవే. అమెరికా, ఇంగ్లండు, ఇందుకు నిదర్శనాలు. మన దేశంలో మనం డెమోక్రసీ, సోషలిజాల కలయికను సాధించగలిగితే ప్రపంచ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని ఆరంభించిన వారలమవుతాం. ఇట్టి మహాకార్యంలో పత్రికల పాత్ర ఎంతైనా ఉంది. తమ కర్తవ్యాన్ని పత్రికలు గుర్తించకపోతే దేశానికి తీరని అపచారం చేసినవుతాయి. అవి డబ్బు సంపాదించవచ్చు కాని వాటికి విలువఉండదు.

పెట్టుబడి దారులు ప్రబలంగాఉన్న ఏ వ్యవస్థలోనూ సోషలిజం వర్ధిల్లదు. ఈకారణంచేతనే పత్రికలు మనదేశంలో సోషలిజానికి ఏమాత్రమూ దోహదమియ్యవు—కారణం పెట్టుబడి దారులైన పత్రికాధిపతులు——!

---

తరుణ నిర్వేదం

# "దూరాన నా రాజు"

### "ఉమాదేవి"

"లతా! ఏంచేస్తున్నావు? బహుశా నీ ఆఫీసు రూము(!)లో ఉండి ముఖ్యమైన పనులేవో చూస్తూ ఉండిఉంటావుకదూ! ప్రమదావనాలు రిఫర్ చేస్తున్నావా ఏదైనా ఎక్స్పెరిమెంటు చెడిపోతే! ఇలా చూడూ, ఇంట్లో యితరపనులేవీ లేకుండా ఊరికే కాలక్షేపం చేసే నీకే తీరకపోతే పెద్ద ఉత్తరాలు వ్రాయటానికి నాకుమాత్రం ఎలా తీరుతుంది చెప్పు? ఎప్పుడూ ఆఫీసు పనే సరిపోయె! నీవేమిటో యీ అదృష్టం నీకుపట్టలేదని దిగులు పడతావు. డిగ్రీలు, వందలువందలు ఆదాయమే ఆనందాన్ని యివ్వగలిగితే యీ పట్టభద్రులూ, లక్షాధికారులంతా మహాసౌఖ్యాలు అనుభవిస్తున్నారని అనుకోవచ్చుగా! కాని...యివి కేవలం కొన్ని సౌఖ్యాలుమాత్రమే యివ్వగలవు లతా! ఏదివుంటే కటికి దరిద్రాన్ని కూడా సంతోషంగా అనుభవించవచ్చో ఏది మనశ్శాంతినిస్తుందో ఆ ప్రేమైక హృదయం కరువైతే...యివన్నీ కూడా ఎందుకూ పనికిరావు...

నా సంగతి చూడు...చూసేవాళ్లు 'హాయిగా హెడ్‌మిస్ట్రెస్...నెలకి రెండువందలు జీతం... ఎంతహోదా!'అనుకుంటారు. 'ఒకరి ఏడుపులేకండా స్వతంత్రంగా బ్రతుకుతోంది యెంత అదృష్టం' అంటారు—అవునా?...కాని యీ హోదాలో గౌరవం పొందగలనుగాని ప్రేమార్ద్రత ఎలా లభిస్తుంది?...అంతా ఏమండీ హెచ్. యం. గారూ అంటూ వినయ విధేయతలు చూపుతారేగాని స్నేహం అనురాగమూ ఏవీ? 'సుభా' అన్న చనువైన సంబోధనే కరువైపోయింది...ఏదో అధికారంతో పెద్దతనం రావటాన వయస్సులోకూడా పెరిగిపోయానా అనిపిస్తోంది! మీలాంటి మిత్రులను కలుసుకున్నప్పుడూ, మీ ఉత్తరాలు అందినప్పుడూ మాత్రం నేను యింతా పాతిక వసంతాలుకూడా చూడలేదన్న విషయం జ్ఞప్తికివస్తుంది...నీవు అనుకోవచ్చు—అందరు అసిస్టెంట్లు, అంతమంది పిల్లలలో ఉండికూడా ఒంటరితనమేనా అని! కాని లతా, నా గదే వేరు. పగలంతా ఏదో నేను చెప్పే ఒక్క క్లాసుకు వెళ్ళటం మినహా సూపర్‌విజన్ పనీ, ఆఫీసు పనీ ఉంటుంది. నాకై నేను వాళ్ళతో కలిసి మెలిసి తిరగాలన్నా వ్యవధీలేదు అవకాశమూ లేదు...అంతా హెచ్.యం.గారంటూ దూరంగా నమస్కారాలతో సరిపెట్టుకుని,తిరుగుతారు స్ట్రిక్టుగా ఉండకపోతే పని సవ్యంగా జరగదాయె. బాధ్యత ఉన్న పదవిలో నున్నప్పుడు మన క్రింది ఉద్యోగులతో ఎలా ఉన్నా పేచీయే అనుకో! ఒకవేళ ఒకరిద్దరితో నేను కలసిమెలసి ఉన్నా అది యితరులకు కన్నెర్రగానే ఉంటుంది...యీ బాధ దేని

కని అందరితోనూ ముభావంగా యథోచితంగానే ఉంటాను.

“సరేగాని లతా!...యింటికిరాగానే మూసి ఉన్న తలుపులు ఎంతటి బాధ కలిగిస్తాయో నీకెలా తెలుస్తుంది?...మనల్ని లక్ష్యపెట్టి మన మీదనే ప్రేమానురాగాలు కేంద్రీకరించే వ్యక్తులుంటే...హాయిగా నీలాగా ఈ ఉద్యోగాలూ బాధలూ లేకుండా యింట్లో ప్రశాంతంగా గడిపే అవకాశమే ఉంటే ఎంత బాగుంటుంది!...నాకు కావలసిన వస్తువులేవో మరొకరు ఊహించి తెచ్చియివ్వాలని నా కోరిక! నెలాఖరున అందరికీ జీతాలిచ్చి నా జీతం రెండువందలూ తీసుకుంటున్నప్పుడైనా నాకేమంత ఆనందం లభించదు. చీరలు కొనుక్కునేటప్పుడు నాకు ఏ రంగు చీరె బాగుంటుందో తోచదు...ఏది ఏరుకోవాలో తోచక ఎంతో బాధపడతాను...అదే నాకు ఆ శ్రమ లేకుండా ఏది నాకు అమరుతుందో మరొకరు ఊహించి తెస్తే...ఆ అనుభవం చాలా బాగుంటుందికదూ...నేనంటే ఎంతో అనురాగం కలిగి నాకు ఏ కాస్త బాధకలిగినా భరించలేకుండా...ఆఖరికి నేను ఎవరితోనైనా మాట్లాడితేనే ఈర్ష్య పొందేంత గాఢంగా నన్ను ప్రేమించే వ్యక్తే ఉంటే! ...హాయిగా మెత్తనిసోఫాలో పడుకుని “తన”కు స్వెట్టరు అల్లుతూ పైన ఫాను తిరుగుతూ ఉంటే రేడియోలోంచి మధురమైన సంగీతం హృదయంగమంగా వినవస్తూవుంటే...తను ఆఫీసునుంచి వచ్చేసరికి మధురమైన సంభాషణలతో సమయోచిత ఉపచారాలతో సేదదీర్చి...తీయని కబుర్లు చెప్పుకుంటూ తోటలో దొంతరమల్లిచెట్లదగ్గరకూర్చుంటే ఎంత మధురంగా ఉంటుందంటావు?... నాది పేరసైటిక్ టెండెన్సీ అంటావా? లేక సినిమాల్లోలాగా కథల్లోలాగా ఊహించుకుంటూ పగటికలల్లో తేలిపోతున్నాననుకుంటున్నావా? ఏమిటో లతా!...ఇప్పుడివన్నీ నీకు పగటికలలులాగే కనిపిస్తాయి. కాని ఒకనాడు యథార్థంగా జరుగుతాయనుకున్నాను. జరిగేవేమోకూడా! కాని గిరీశం అన్నట్లు కథ అడ్డంతిరిగింది. అంత సుఖపెట్టగల సమర్థుడే తను! నిజంగా నా ప్రేమమూర్తి నాకు దక్కేఉంటే ఆ భోగజీవితం లేకపోయినా ఆనందంగానే ఉండి ఉండేది! ఇలా నేను ఉద్యోగం చేసినా నాకు ఆనందం లభించి వుండేది!...కాని ఇప్పుడు తను ఎక్కడున్నాడో! ఏంచేస్తున్నాడో. ఎలా బాధపడుతున్నాడో. తనూ నాలాగే అనుక్షణమూ నన్నే స్మరిస్తూ కాలం బరువుగా వెళ్ళదీస్తున్నాడో...లేక విరక్తితో నామాటే తలవటం మానేశాడో!...జీవితానందాన్ని విధి కొల్లగొడితే చివరికి కోరికలు పగటికలలుగా మిగిలిపోతాయి లతా!...అవే... ఆ మధురస్మృతులే నా మనస్సును అనుక్షణమూ బాధిస్తూ చిత్రవధ చేస్తున్నాయి నన్ను...

అన్నీ మర్చిపోయి నా దృష్టిని వృత్తివైపు మరల్చి అందులో లీనమయి పోవాలనుకుంటాను. మాటిమాటికీ ఆత్మపరిశోధన చేసుకుంటూవుంటాను. కాని నా సైకాలజీ పరిజ్ఞానం పరీక్షలో దిగ్విజయం సాధించటానికి ఉపయోగించిందే కాని నా హృదయాన్ని అదుపులో ఉంచటానికి పనికి రావటంలేదు. దానికీ ధృఢనిశ్చయశక్తి కావాలనుకో...అయినా...ఏవీకూడా అతని స్మృతిని నా మనోవీధిలోంచి తొలగించలేక పోతున్నాయి. ఈ ఉద్యోగం...హోదా...యీ జీతం నాకేవిధమైన ఆనందం ప్రసాదించలేక పోతున్నాయి లతా! ...ఇదే నాసౌఖ్యంలోని నిగూఢ రహస్యం! నా జీవితంలో నీకు అర్థంకానిభాగం...యీ అదృష్టం నీవు కోరుకోవద్దు లతా... నీకేకాదు ... నా శత్రువుకైనా వద్దు... హృదయంలో అగ్నిపర్వతాలు దాచుకుని పైకి చిరునవ్వు వెన్నెలలు ప్రసరింపజేస్తూ తిరిగేశక్తి చాలా తక్కువమందికుంటుంది. నాలో ఆశక్తి తగినంత లేదని నా అనుమానం! అనుక్షణమూ నాకు అదేభయం—ఏ క్షణాన నా హృదయాంతరాళంలోని అగ్నిపర్వతాలు బ్రద్దలవుతాయోనని—ఇంకా ఏమివ్రాయమంటావు చెప్పు?

ఇక నీ సంగతికివస్తే... కోరుకున్న వ్యక్తిని లక్షణంగా పెండ్లాడగలిగావు. అనుక్షణమూ అతని చేత ఆరాధింపబడుతున్నావు. ఇంతకంటె కోరుకోదగింది ఏముంది. నాలాగ డిగ్రీలూ, ఉద్యోగమూ లేవని నీవు బాధపడనక్కర్లేదు — పదికాలాల పాటు నీ ప్రేమమూర్తితో సుఖంగా ఉండమని ఆశీర్వదించటంకన్నా నేను చేయగలిగిందేముంది? ఇప్పటి కింక సెలవు. ప్రేమతో, నీ “సుభ.” ★